GSTIN:36FDKPS1308P1ZX

# టి-మీడియా

T MEDIA

సామాజికం ... ప్రజల పక్షం...

epaper,www.tmedia.net.in YouTube facebook



## టీమీడియా, ప్రత్యేక సంచిక



# తుమ్మల@ సెప్టెంబర్ సెంట్ మెంట్

**రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక కాలం మంత్రిగా రికార్డు సృష్టించిన తుమ్మల నాగేశ్వరరావు రాజకీయానికి సెప్టెంబర్ నెల ఒక సెంటిమెంట్‌గా మారింది. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆశీస్సులతో, దివంగత ఎన్టీఆర్ దీవెనలతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరంగా నిలిచిన తుమ్మల, అభివృద్ధే అజెండాగా చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి కార్యక్రమాలతో చెరగని ముద్ర వేశారు. పదవుల కోసం కాకుండా, ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం పార్టీలు మారిన సందర్భాలన్నీ సెప్టెంబర్ నెలలోనే జరిగాయి. నలుగురు ముఖ్యమంత్రుల క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన అరుదైన ఘనత సాధించారు. ఇది కేవలం తుమ్మల జీవితంలోనే ప్రత్యేకం కాదు, ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ చరిత్ర గతిని మార్చిన నెల సెప్టెంబర్ అని చెప్పటంలోనూ అతిశయోక్తి ఏమి లేదు.**

**టీ మీడియా, ఖమ్మం జిల్లా బ్యూరో :**

- 43 ఏళ్ల రాజకీయ ప్రస్థానం
- కీలక మలుపులన్నీ సెప్టెంబర్ లోనే
- నలుగురి సీఎంలతో నడక
- భక్త రామదాసు, సీతారామ సార్థకం
- రైతుల తలరాత మార్చిన తుమ్మల
- గోదావరి కరకట్ట నుంచి సింగరేణి పునాది వరకు మార్కు
- ఖమ్మం గడ్డంపై చెరగని ముద్ర వేస్తున్న మంత్రి





**ఎన్టీఆర్ దీవెనలతో మొదలైన ప్రస్థానం**

తుమ్మల నాగేశ్వర రావు రాజకీయ ప్రస్థానం 1982 సెప్టెంబర్ నెలలో దివంగత ఎన్టీఆర్ ఆశీర్వాదంతో తెలుగుదేశం పార్టీలో చేరడంతో మొదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చర్లలో ఎన్టీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తుమ్మల.... ఆయన దీవెనలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టి, తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేశారు. 1986లో చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, గోదావరి జల ప్రళయం మిగిల్చిన విషాదం సమయంలో, నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మరియు ప్రధాని రాజీవ్ గాంధీతో కలిసి వరద ప్రాంతాల్లో పర్యటించి, వరద గండం లేకుండా భద్రాచలం వద్ద కరకట్టకు రూపకల్పన చేశారు.

**చంద్రబాబుతో సాగిన ప్రగతి ప్రయాణం**

1994 సెప్టెంబర్ రాజకీయ సంక్షోభంలో రాష్ట్ర ప్రగతి కోసం విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడుకు తుమ్మల మద్దతుగా నిలిచి, బాబుతో రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మహర్దశ పట్టించిన మంత్రిగా తుమ్మల పేరు తెచ్చుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట నిర్మాణం, కూనవరం-తాలిపేరు హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం, ఖమ్మం బైపాస్ రోడ్, మున్నేరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం, భక్త రామదాసు ఆడిటోరియం, సర్దార్ పటేల్ స్టేడియం నిర్మాణం, పీజీ కాలేజ్ నిర్మాణం, ప్రభుత్వ జిల్లా ప్రధాన హాస్పిటల్ విస్తరణ లాంటివి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలితమే. ప్రతీ గ్రామానికి రహదారి, తాగునీరు, వ్యవసాయ మార్కెట్లు, గోడౌన్స్, విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులతో ఖమ్మం జిల్లాలో కొత్త శకానికి అంకురార్పణ చేశారు.



**సింగరేణిని నిలబెట్టిన ఘనత**

చంద్రబాబు నాయుడు హయాంలో తుమ్మల చేసిన మరో అద్భుతమైన పని, నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణిని ప్రత్యేక ప్యాకేజీతో నిలదొక్కుకునేలా పునాది వేయడం. ట్రేడ్ యూనియన్ ఎన్నికలు మరియు లాభాల్లో వాటాకు శ్రీకారం చుట్టడం ద్వారా కార్మికులకు భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయాలే నేడు తెలంగాణకు గ్రోత్ ఇంజిన్‌గా నిలిచిన సింగరేణికి బాటలు వేశాయి. వేంసూరు దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేసేలా బేతుపల్లి ఎన్టీఆర్ వరద కాలువను నిర్మించి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ పనులన్నీ తుమ్మల దూరదృష్టికి, పాలనా దక్షతకు నిదర్శనం.

**కేసీఆర్ ఆహ్వానంతో టీఆర్ఎస్‌లోకి**

ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం రాజకీయ జన్మ ఇచ్చిన తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి, కేసీఆర్ ఆహ్వానంతో 2014 సెప్టెంబర్‌లో టీఆర్ఎస్‌లో చేరిన సందర్భం తుమ్మల రాజకీయ జీవితంలో మరో కీలక మలుపు. పార్టీ మారే నిర్ణయం వెనుక వ్యక్తిగత స్వార్థం కాకుండా, ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసమేనని ఆయన స్పష్టం చేసి మంత్రి అయ్యారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టుకు పునాది వేయడం, పాలేరు కరువును తరమికొట్టే భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టడమంతా ఆయన హయాంలోనే జరిగింది. పాలేరును పచ్చగా చేయటానికి అనేక అవకాశాలు కల్పించారు.

**ఆయిల్ ఫామ్ సాగుకు బాటలు**

కేసీఆర్ ప్రభుత్వంలో తుమ్మల ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు విశేష కృషి చేశారు. అప్పారావుపేటలో నూతన పామాయిల్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు, తెలంగాణలో ఇరవై లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు క్యాబినెట్ ఆమోదం పొందేలా చర్యలు తీసుకున్నారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు జాతీయ రహదారి నిర్మాణం, పాలేరులో చెక్ డ్యాంలు, తండాలకు తారు రోడ్ల నిర్మాణంతో దశాబ్దాల కల సాకారం చేశారు. ఈ విధంగా, తుమ్మల వ్యవసాయ, మౌలిక వసతుల రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని చేశారు.

**మంచుకొండ ఎత్తిపోతల పథకం**

రఘునాథపాలెం మండలంలోని రైతుల సాగునీటి కలను సాకారం చేస్తూ, మంచుకొండ ఎత్తిపోతల పథకానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీకారం చుట్టారు. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్‌కు ప్రతిపాదనలు వంటివి ఆయన భవిష్యత్ లక్ష్యాలు. భద్రాచలం రామాలయం విస్తరణకు రూ.34 కోట్ల నిధులు కేటాయించడం, భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట విస్తరణ పనులు, రెండో బ్రిడ్జి ప్రారంభం వంటివి ఆధ్యాత్మిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తున్నాయి.

**రేవంత్ రెడ్డితో కాంగ్రెస్‌లో కొత్త ప్రయాణం**

2023 సెప్టెంబర్‌లో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆహ్వానంతో కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల రాజకీయ ప్రస్థానంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఈ సందర్భంలో కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి, ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయాలనే షరతు పెట్టడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసే రాజీవ్ లింక్ కెనాల్, వేంసూరు మండలం కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం వంటివి ప్రస్తుతం మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు అజెండాలుగా ఉన్నాయి.





**మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి, కరకట్ట**

ఖమ్మం నగరానికి మున్నేరు నది వరద గండం లేకుండా కరకట్టల నిర్మాణం, కాల్వొడ్డు వద్ద మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణంపై తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ పనుల వేగవంతానికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇవే కాకుండా రఘునాథపాలెం వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజీ, స్వామి నారాయణ గురుకుల పాఠశాల ఏర్పాటు వంటివి విద్యా, వైద్య రంగాల్లో ఆయన కృషిని చూపిస్తున్నాయి. వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు, ఖమ్మంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం, ఆధునిక సౌకర్యాలతో మోడల్ వ్యవసాయ మార్కెట్ నిర్మాణం వంటివి ఖమ్మం నగరాన్ని ఆధునిక నగరంగా మారుస్తున్నాయి. ఖమ్మం నుంచి రాజమండ్రి వరకు నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం, ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామీ ఆలయం నిర్మాణం కోసం సంప్రదింపులు వంటివి తుమ్మల నాగేశ్వర రావు విస్తృతమైన దూరదృష్టికి నిదర్శనం.



**ఖమ్మం అభివృద్ధి కొత్త పుంతలు**

తుమ్మల నాగేశ్వరరావు తన రాజకీయ జీవితంలో గోదావరి, కృష్ణా జలాలను ఉపయోగించుకుని సీతారామ, భక్త రామదాసు ప్రాజెక్టులను నిర్మించడం, అనేక ప్రాజెక్టులు చేపట్టి లక్షలాది మంది రైతుల తలరాతను మార్చారు. ఆయన భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆశీస్సులు, ఎన్టీఆర్ దీవెనలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నిజంగా ఒక వరం అని ప్రజలు భావిస్తున్నారు. మంత్రిగా తుమ్మల చేసిన కృషి ఖమ్మం జిల్లా ముఖచిత్రాన్ని పూర్తి గా మార్చి వేసింది. రోడ్లు, బ్రిడ్జిలు, విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యా సంస్థలు, వైద్య శాలలు, మరియు నీటి పారుదల ప్రాజెక్టులతో ఖమ్మం గడ్డం పై చెరగని ముద్ర వేశారు. కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా, సింగరేణి వంటి సంస్థలను బలోపేతం చేసి, వేలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించారు. తుమ్మల హయాంలోనే ఖమ్మం అభివృద్ధి కొత్త పుంతలు తొక్కిందని స్థానికులు గర్వంగా చెబుతారు.

**నలుగురు సీఎంల కేబినెట్‌లో మంత్రి**

43 ఏళ్ల రాజకీయ జీవితంలో తుమ్మల నలుగురు ముఖ్యమంత్రుల కేబినెట్‌లో మంత్రిగా పనిచేసి, సుదీర్ఘకాలం పాటు మంత్రిగా రికార్డు సృష్టించారు. ఈ ప్రయాణంలో ప్రతి కీలక మలుపు, ప్రతి పార్టీ మార్పు సెప్టెంబర్ నెలలోనే జరిగింది. ఈ విధంగా, నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో సెప్టెంబర్ నెల ఒక సెంటిమెంట్‌గా నిలిచి, రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు నాంది పలికింది. మంత్రిగా తుమ్మల చేసిన కృషి ఖమ్మం జిల్లా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆయన చేపట్టిన ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు ముందు తరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయనటంలో అతిశయోక్తేమి లేదు. ఖమ్మం ప్రజల హృదయాల్లో ఆయన ఒక అభివృద్ధి ప్రదాతగా శాశ్వతంగా నిలిచిపోతారనేది కాదనలేని సత్యం.